ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

- ప్రతి పనికీ శాశ్వత నంబర్ వినియోగం
- నవీకరణకు జూన్14 వరకు అవకాశం



మహేశ్వరం మీసేవ కేంద్రంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

మహేశ్వరం: ప్రస్తుతం ప్రతి పనికి ఆధార్ కార్డు తప్పనిసరి అయింది. బ్యాంకు ఖాతా తెరవాలన్నా.. రుణాలు పొందాలన్నా, ఇలా ఆర్థిక పరమైన అంశాలతో పాటు, జనన, మరణ, వివాహ తదితర ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నా ఆధార్ లేనిదే పనవడం లేదు. ఇదిలా ఉండగా.. ఇప్పుడు పదేళ్లకోసారి ఆధార్ నవీకరించుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటి వరకు అప్‌డేట్ చేసుకోనివారు త్వరగా చేసుకోవాలని, ఈ మధ్య కాలంలో చేసుకుంటే అవసరం లేదని స్పష్టం చేస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ఆధార్ అప్‌డెట్‌కు ఈసేవా, ఆధార్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. గ్రామాల్లోనూ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు.

పేరులో మార్పు

పేరు సవరణ కోసం తప్పనిసరిగ్గా ఫొటో గుర్తింపు కలిగిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. పదో తరగతి మెమో, ఓటర్ గుర్తింపు కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉపాధిహామీ జాబ్‌కార్డు, సదరం ధ్రువీకరణ పత్రం తదితర వాటిల్లో ఏదైనా ఒకటి జత పరచాలి.

పుట్టిన తేదీ..

చిన్నారులకు తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. కార్డులో ఒక్కసారి మాత్రమే పుట్టిన తేదీని మార్చుకునే వీలుంది. రెండోసారి కావాలంటే రాష్ట్ర రాజధాని యూఐడీఎం కార్యాలయానికి వెళ్లి తగిన వివరణతో పాటు ఆధారాలు చూపాలి.

చిరునామా..

ప్రతి పదేళ్లకు ఒకసారి ఆధార్‌కార్డులో చిరునామా స్థానికతను నిర్ధారించుకుంటూ అప్‌డెట్ చేసుకోవాలి. దీనికి చిరునామా ధ్రువీకరణను జత పర్చాలి. గతంలో గెజిటెడ్ అధికారుల సంతకంతో పేరు, తండ్రి పేరు, పుట్టిన తేది, చిరునామా మార్పిడి చేసుకునే అవకాశం ఉండేది. ప్రస్తుతం తహసీల్దార్, మున్సిపాలిటీ కమిషనర్ జారీ చేసిన గుర్తింపు కార్డు చూపాలి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇచ్చే పత్రంతో విద్యార్థులు మార్చుకోవచ్చు. ఓటరు, రేషన్, బ్యాంకు ఖాతా పుస్తకం, పాసుపోర్టులో సరైన చిరునామా ఉంటే వాటితో సరి చేసుకోవచ్చు. కరెంటు బిల్లు, టెలిఫోన్ బిల్లు, గ్యాస్ కనెక్షన్ ధ్రువ పత్రం వినియోగించుకోవచ్చు.

మూడు విభాగాలు..

గతంలో సవరణకు రెండు రకాలుగా దరఖాస్తు పత్రాలు ఉండేవి. ప్రస్తుతం వయస్సు ఆధారంగా మూడు విభాగాలుగా విభజించారు. ఒకటి ఐదేళ్ల లోపు పిల్లలు, రెండోది 5–18 ఏళ్లు ఉన్న వారు, మూడోది అపై వయస్సు ఉన్న వారీగా దరఖాస్తు ఫారాలు సిద్ధం చేశారు. అప్‌డెట్‌లో ఇదే విధానాన్ని అమలు చేస్తున్నారు. 18 ఏళ్లు పైబడి కొత్తగా దరఖాస్తు చేస్తే.. సంబంధిత తహసీల్దార్‌తో ధ్రువీకరణ చేసుకోవాల్సి ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం

ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి మీసేవ కేంద్రాల ద్వారా 42 కేంద్రాలతో పాటు.. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశాం. గ్రామాల్లో చాటింపు చేయించాం. రేషన్ దుకాణాలు, జీపీ, మున్సిపాలిటీ కార్యాలయాల వద్ద ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని బ్యానర్లు కట్టించాం. ఫోన్లలో మెసేజ్‌లు పెట్టాం. సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చి సెల్‌ఫోన్లలో అప్‌లోడ్ చేసి అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇప్పటికీ అప్‌డేట్ చేసుకోని వారు ఈ నెల 14 లోపుగా చేసుకోవాలి. ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి. మొబైల్ నంబర్, ఇతర వివరాలు అన్నీ సరిగా ఉండేటట్లు చూసుకోవాలి.

– నాగభూషణం, ఈ–డిస్ట్రిక్ జిల్లా మేనేజర్

క్లుప్తంగా

పుస్తెమట్టెలు అందజేత



పుస్తెమట్టెలు అందిస్తున్న పాండు తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని ధన్నారంకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన యువతి శ్రీలతకు వివాహం నిశ్చయమవగా.. మార్కెట్ కమిటీ డైరెక్టర్ పిట్టల పాండు శుక్రవారం వివాహానికి అవసరమైన బంగారు పుస్తెలతాడు, మెట్టెలు, నూతన వస్త్రాలు అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. అనంతరం వివాహానికి హాజరై నూతన దంపతుల్ని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు పి.బాల్‌రాజ్‌ముదిరాజ్, వర్ర యాదమ్మ, రమేష్, మంద కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ బదిలీ



భాస్కర్

పహడీషరీఫ్: బాలాపూర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్‌ను బదిలీ చేస్తూ రాచకొండ సీపీ డీ.ఎస్.చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో వెంకట్‌రెడ్డిని నియమించారు. 2019 డిసెంబర్ 18 నుంచి భాస్కర్ సమర్ధవంతంగా తన విధులను కొనసాగించారు. ఒకటి, రెండు రోజుల్లో నూతన ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

రంగారెడ్డి కోర్టులు: జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా శనివారం జరగబోయే లోక్‌అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరేకృష్ణ భూపతి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ సంవత్సరం నిర్వహించిన మొదటి జాతీయ లోక్‌అదాలత్‌లో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉందన్నారు. అదే స్ఫూర్తితో శనివారం కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించే 2వ జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 29 ప్రత్యేక లోక్‌అదాలత్ ధర్మాసనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి పట్టాభి రామారావు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సంతోష, బ్లాక్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సుబ్బూరు మల్లికను నియమించారు. ఈ మేరకు శుక్రవారం నియామకపత్రాలను మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అధ్యక్షులు ఆనంద్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు మంగమ్మ, కౌన్సిలర్ మమత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు పాండు రంగారెడ్డి, పాండు, టోని, మురళి పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కేంద్రం కృషి

ప్రధాని మోదీ చిత్రపటాలకు బీజేపీ నేతల క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం: రైతు సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల భాస్కర్, కొత్త అశోక్‌గౌడ్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి అన్నారు. పంటల గిట్టుబాటు ధరలను పెంచినందుకు ప్రధాని మోడీ చిత్రపటానికి ఇబ్రహీంపట్నంలో బీజేపీ నాయకులు శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వివిధ రకాల పంటలకు మద్దతు ధర రూ.200 నుంచి రూ.800 వరకు కేంద్ర ప్రభుత్వం పెంచినందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఫసల్ బీమా పథకం అమలు పరచడంలేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రైతులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కాళిదాసు, వెంకటేశ్‌గౌడ్, నర్సింహారెడ్డి, రాఘవేంద్రస్వామి, అశోక్, శ్రీశైలం, సంతోష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఫసల్‌బీమా అమలెక్కడ..

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫసల్‌బీమా అమలు చేయకుండా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కొత్త అశోక్‌గౌడ్ విమర్శించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ బొంగ్లూర్ చౌరస్తాలో శుక్రవారం ఆ పార్టీ నేతలు.. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాములు, నారయణయాదవ్, యాదగిరిరెడి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనకు చెందిన బ్యాగరి లక్ష్మయ్య ఇటీవల నూతన ఇంటి నిర్మాణం చేపట్టాడు. డబ్బులు లేక మధ్యలోనే ఇంటి నిర్మాణాన్ని నిలిపివేశాడు. స్థానిక ఉపసర్పంచ్ సుధాకర్ సహకారంతో జెడ్పీటీసీ, ఉప్పల ట్రస్టు చైర్మన్ ఆర్థికసహాయం అందజెయ్యాలని కోరారు. తక్షణమే స్పందించిన జెడ్పీటీసీ ట్రస్టు సభ్యులచే లక్ష్మయ్య ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక, కాంక్రీట్, తదితర మెటీరియల్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధాకర్, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, రాజేందర్‌రెడ్డి, మహేందర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పండుగల పేరిట ప్రజాధనం లూటీ

- అసంపూర్తి చెరువు కట్టలపై దశాబ్ది సంబురాలా?
- కాంగ్రెస్ నేతల విమర్శలు



నాలా పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: దశాబ్ది ఉత్సవాల పేరిట తెలంగాణ ప్రభుత్వం ప్రజాధనం లూటీ చేస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో మాజీ జెడ్పీటీసీ బంగారు సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షుడు రాఘవేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి కోమటి కుంట చెరువు, ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో ఒక్క చెరువుకూడా సుందరీకరణ పనులు పూర్తి చేయలేదని, పనులు ఆగిపోయిన చెరువుకట్టలపై ఉత్సవాలు చేసుకోవడం బీఆర్ఎస్ పార్టీ నాయకులకే చెల్లిందని ఎద్దేవా చేశారు. అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు ఏడాదిగా మురుగునీరుతో కంపు కొడుతున్నా.. సంబంధిత అధికారులు, అధికార పార్టీ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఎస్‌డీపీ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయి వెక్కిరిస్తుంటే వాటిని వదిలేసి, చెరువుకట్టపై చిందులు వేయడం బీఆర్ఎస్ వర్గాలకే చెల్లిందని దుయ్యబట్టారు. సంబురాల పేరిట ప్రజాధనంతో విందుబోజనాలు చేసుకుంటున్న తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. ప్రజాధనం వృథా చేయకుండా.. నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వంశీ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయండి

ఏఐటీయూసీ

మీర్‌పేట: కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వాటర్ లైన్‌మెన్‌లు, పంప్ ఆపరేటర్లకు కనీస వేతనం (రూ.19,500) అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శుక్రవారం కమిషనర్ నాగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న పంప్ ఆపరేటర్స్, వాటర్ లైన్‌మెన్‌లు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికుల న్యాయమైన పరిష్కరించాలని, 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా దుస్తులు, పీఎఫ్, గుర్తింపుకార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కాలువ శంకర్, నాయకులు వెంకట్రాంరెడ్డి, నరేందర్, తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీలో ప్రధాని ఫొటో ఏదీ?

అధికారులను నిలదీసిన బీజేపీ నాయకులు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బడంగ్‌పేట కార్పొరేషన్‌లో జరిగిన అభివృద్ధి గురించి పట్టిక తయారు చేసి (బహిరంగ ఫ్లెక్సీ) ప్రదర్శించడాన్ని బీజేపీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు తప్పుపట్టారు. ఈ మేరకు కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అభివృద్ధి పట్టికలో సీఎం కేసీఆర్, కేటీఆర్, స్థానిక మంత్రి సబితారెడ్డి, మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ ఫొటోలు పెట్టి ప్రధానమంత్రి ఫొటో ఎందుకు పెట్టలేదని కమిషనర్‌ను ప్రశ్నించారు. కార్పొరేషన్‌కు కేటాయించిన నిధుల్లో కేంద్రం నిధులే ఎక్కువగా ఉన్నాయని, అలాంటిది ప్రధాని ఫొటో ఎందుకు వేయలేదో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు అన్ని పార్టీలను సమానంగా చూడాలని, అధికార పార్టీకే వత్తాసు పలకడం సరైంది కాదని హితవు పలికారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, మహిళా కార్పొరేటర్లు అమిత, సునిత, అనిత, రమాదేవి, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్, వీరకర్ణారెడ్డి, వెంకటేశ్, మహేశ్, శ్రీశైలం, శూరకర్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు, ఆర్టీసీకి వారధిగా పనిచేయాలి

విలేజ్ బస్సు ఆఫీసర్లకు ఆర్టీఓ వెంకటాచారి సూచన



మాట్లాడుతున్న ఆర్టీఓ వెంకటాచారి

ఇబ్రహీంపట్నం: కొత్తగా నియమితులైన విలేజ్/కాలనీ బస్సు ఆఫీసర్లు ప్రయాణికులకు, ఆర్టీసీకి అనుసంధానంగా పనిచేయాలని ఇబ్రహీంపట్నం ఆర్టీఓ వెంకటాచారి సూచించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశానుసారం ఆర్టీసీ విలేజ్/కాలనీ బస్సు ఆఫీసర్లను నియమించి శుక్రవారం వారికి కిట్లను ఆర్టీఓ వెంకటాచారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీఓ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఎండీగా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్టీసీలో వినూత్న మార్పులను తీసుకోస్తున్నారని అందులో భాగంగా విలేజ్ ఆఫీసర్లను నియమించారన్నారు. తమ బాధ్యతలను విలేజ్ ఆఫీసర్లు అంకితబావంతో నిర్వర్తించాలన్నారు. అనంతరం స్థానిక డిపో మేనేజర్ అశోక్‌రాజు మాట్లాడుతూ.. కాలనీ ఆఫీసర్ల పేర్లను అన్ని గ్రామ పంచాయతీలకు తెలియజేసినట్లు చెప్పారు. గ్రామాల్లోని ఆర్టీసీ సమస్యలను తెలుసుకొని మార్పులు, చేర్పులు, సలహాలు స్వీకరించి ఆర్టీసీ డిపో అధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి విలేజ్ ఆఫీసర్లు ప్రయత్నించాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, ఏఈఎం సత్తయ్య, బస్‌స్టేషన్ కంట్రోలర్ నర్సింహ, వెల్ఫేర్ కమిటీ సభ్యులు వైవీ రెడ్డి, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ బీఆర్ఎస్ సర్కార్ అందిస్తోన్న సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, చేనేత కార్మికుల ఫించన్ల కోసం ప్రతీనెల సుమారు రూ.7 కోట్లను ప్రభుత్వం ఖర్చు పెడుతుందన్నారు. తొమ్మిదేండ్లలో సుమారు రూ.452.52 కోట్లు పెన్షన్ల రూపంలో పేదలకు అందాయన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎం ఆర్ఎఫ్ కింద వేలాది మంది లబ్ధిపొందినట్లు చెప్పారు. గురుకుల విద్యాలయాలను, సంక్షేమ హాస్టళ్లను, కళాశాల స్థాయి హాస్టళ్లను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నామన్నారు. కనీవిని ఎరుగని రీతిలో పేదల సంక్షేమం, అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల సంక్షేమానికి అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా పథకాల ద్వార విద్యా, ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు కృషిచేయాలన్నారు.

చెక్కుల పంపిణీ..

నియోజకవర్గానికి చెందిన 100 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, ఆరుగురు బీసీ కులవృత్తుల లబ్ధిదారులకు ఆర్థికసాయం చెక్కులను, కులాంతర వివాహం చేసుకున్న ముగ్గురికి మ్యారేజ్ స్కీం చెక్కులను, విదేశాల్లో విద్యాభ్యాసం కోసం వెళ్లే ముగ్గురు విద్యార్థులకు అంబేడ్కర్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ చెక్కులు (ఒక్కొక్కరికి రూ.20లక్షలు), ఆసరా ఫించన్లను ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు కృపేశ్, నర్మద, జెడ్పీటీసీ జంగమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, అదనపు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి జంగారెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ పథకాల లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

మంత్రి సబితారెడ్డి



మహేశ్వరం: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: గొల్లకురుమల సామాజిక, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ సర్కార్ పనిచేస్తోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీలోని మంఖాల్‌లో శుక్రవారం 9 మంది గొల్లకురుమ, యాదవుల లబ్ధిదారులకు సబ్సిడీ గొర్రెల పంపిణీ ప్రొసీడింగ్ పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న కులవృత్తుల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. చేతి, కులవృత్తుల వారికి సబ్సిడీపైన రుణాలు అందించి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం మంఖాల్‌లోని 6,7,8 వార్డుల్లో రూ.కోటి 36 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా యాదవులు మంత్రికి గొర్రె పిల్లలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, వైస్ చైర్మన్ భవానీ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు తేజశ్వీని, విలాస్, రవినాయక్, లావణ్య, పద్మ, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాసర్‌ఖాన్, వేంకటేశ్వర ఆలయ కమిటీ డైరెక్టర్ శ్రీలత యాదవ్, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ రాములు యాదవ్ పాల్గొన్నారు.

జల కష్టాలు తీర్చిన ముఖ్యమంత్రి

బడంగ్‌పేట్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి, ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అల్మాస్‌గూడ పోచమ్మకుంట చెరువుకట్టపై నిర్వహించిన చెరువుల పండుగలో మంత్రి పాల్గొని చెరువుకు పూజలు చేయగా.. బతుకమ్మ, బోనాలతో మహిళలు పోచమ్మకు నైవేద్యం సమర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. సమర్థవంతమైన నాయకుడు కేసీఆర్ పాలనలో నియోజకవర్గంలో నీటి కష్టాలు తీరాయని చెప్పారు. అదే విధంగా రూ.110 కోట్లతో నాళాల పనులు చేపట్టామని, రూ.210 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా రిజర్వాయర్లు కడుతున్నామని, గుర్రంగూడ, కుర్మల్‌గూడ, బడంగ్‌పేటల వద్ద పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. బడంగ్‌పేటలోని చెరువులు, కుంటలు సుందరీకరణ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ శేఖర్, కార్పొరేటర్లు స్వప్న, కవిత, దీపిక, రాంరెడ్డి, భీమిడి స్వప్న, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, స్థానికనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య

తుర్కయంజాల్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మున్సిపల్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కోశిక ఐలయ్య అన్నారు. శుక్రవారం కమ్మగూడలోని శ్రీశ్రీనగర్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంతో ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారని, ఉచితంగా పుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు అన్ని వసతులు ఉన్నందున తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రులకు ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హీర్యానాయక్, నోడల్ ఆఫీసర్ రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శంకర్ దాసు, ఉపాధ్యాయులు కృష్ణ, జయమ్మ, గీత, అంగన్‌వాడీ టీచర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల వైపే మొగ్గు..

- సత్ఫలితాలిస్తోన్న బడిబాట
- పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పిస్తున్న తల్లిదండ్రులు



సలార్‌పూర్‌లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే అత్యుత్తమ బోధన, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తుండటంతో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి పథకం కింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం పంపిణీ, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు బోధన చేస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. పదోతరగతిలో అత్యుత్తమ మార్కులతో బాసర ట్రిపుల్ ఐటీలో ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సీట్లు సాధిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో అందించే సౌకర్యాలు, విద్యాబోధన తదితర అంశాలపై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

మండలంలో..

మండల వ్యాప్తంగా 6 ఉన్నత, 1 కేజీబీవీ, 2ఆశ్రమ, 5ప్రాథమికోన్నత, 29ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. గతంలో విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో కొండ్రిగానిబోడ్, అన్మాస్‌పల్లి, బోయిన్‌గుట్టతండా, నేరేళ్ల కోళ్లు, నాగిరెడ్డిగూడ, పిల్లిగుండుతండా, టాక్‌రాజుగూడ, మర్రిపల్లి, చిన్న వేములోనిబావి తండా తదితర పాఠశాలలు మూతపడ్డాయి. మండల వ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 2,320 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

పదిలో ఉత్తీర్ణత ఇలా..

2022–23 విద్యాసంవత్సరం పదోతరగతి పరీక్ష ఫలితాల్లో కడ్తాల్ మండలంలో 384 మంది విద్యార్థులకు గాను 354 మంది ఉత్తీర్ణత సాధించారు(93.15%). కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియానికి సంబంధించి 105 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 94 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికల ఉన్నత పాఠశాలలో 80 మంది విద్యార్థినులకు 73 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. కస్తూర్బా గాంధీలో 41మందికి 40మంది ఉత్తీర్ణత సాధించారు. ఏక్వాయిపల్లి ఉన్నత పాఠశాలలో 09 మందికి 09మంది ఉత్తీర్ణత సాధించగా, చరికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 23మందికి 23మంది ఉత్తీర్ణత సాధించారు. రావిచేడ్‌లో 43మంది విద్యార్థులకు 39 మంది ఉత్తీర్ణత సాధించగా, ముద్విన్ పాఠశాలలో 36మందికి 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణుల య్యారు. మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 43 మందికి 43 మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, నాణ్యమైన బోధన లభిస్తోంది. విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తోంది. పదో తరగతి ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మంచి మార్కులు సాధిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. – జంగయ్య, నోడల్ అధికారి, కడ్తాల్

అవగాహన కల్పిస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో అనుభజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందుతోంది. మంచి మార్కులతో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. బడిబాట కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పిస్తున్నాం. – సర్దార్‌నాయక్, ఎంఈఓ, కడ్తాల్